

# కబోది

పవని నిర్మల ప్రభావతి

"మీకు రేపే కళ్ల అపరేషన్ చేస్తాం. ఈ రాత్రికి ఆహారం ఏమీ పుచ్చుకోకండి." ఐస్పెషలిస్టు డాక్టర్ రాజేశ్వరరావు. కంట్రాక్టరు శంకరయ్య బెడ్ దగ్గరసా వచ్చి అన్నాడు.

"రేపే?" ఏదో భయం శరీరమంతా ఆవహించగా, గాభరాగా అన్నాడు శంకరయ్య. కనిపించని కళ్ళతో. డాక్టర్ గొంతుక వినిపించిన వేపుకు చూస్తూ.

"ఆ!"

"కానీ. నా భయం...నా భయం..." శంకరయ్య ఏదో చెప్పబోయాడు. డాక్టర్ అయన మాటలకు అడ్డొస్తూ నవ్వాడు. "నాకు తెలుసు మీ భయం, మీకళ్ళు వస్తాయో, రావోనని కాదూ! మీరు నిశ్చింతగా వుండండి, మేం చెప్పినట్లు వినండి. మానవప్రయత్నమంతా చేద్దాం. తర్వాత..." డాక్టర్ గొంతుకలో

వినుగుదల స్పష్టంగా ధ్వనించింది. శంకరయ్యకు. అయితే. అది "ఖరీదైన" పేషెంటును "ఖరీదైన" నవ్వుతోమంద లించినట్లుంది.డాక్టర్ వెళ్ళిపోయినందుకు గుర్తుగా రూమ్‌బయటకు బూట్లచప్పుడు కూడా వెళ్ళిపోయింది. శంకరయ్య బెడ్‌మీద ఇబ్బందిగా కదిలాడు. ఇది చాలా విశాలమైన స్పెషల్ రూమది! అటాచ్‌డ్‌బాత్‌రూం. లావెట్రీ,కిచెన్.. ఫామిలీకైపురూమ్. భార్యా. కొడుకూ చెప్పారామాట. రూమ్ బయట నౌకరు మల్లన్న కూర్చుని వుంటాడు. పిలిస్తే పలుకుతాడు. వచ్చి అవసరాలుచూస్తాడు. కొడుకూ, కోడలూ, కూతురూ,అల్లుడూ, భార్యా. అంతా భోజనానికి వెళ్లారు ఇంటికి. బహుశా ఓ గంట, గంటన్నర తర్వాత రావొచ్చు ఈ పెద్దరూమ్‌లో... రూమ్‌లో ఏమిటి...ఈ విశాలప్రపం చంలో, ఒంటరిగా...కళ్లు కనిపించ కుండా...భయంకరమైన చీకటి మనసు నిండా, కళ్ళచుట్టూరా అవరించుకొని వుండగా. ఇలా నిస్తేజంగా పడుకోవ టం ఎంతటి నరకం! కళ్ళు కనిపించక పోవటమన్నది ఇంతటి బాధాకరంగా, ఇంతటి దుస్సహంగా, వుంటుందని, ఇప్పుడర్థమౌతోంది తనకు! ఎన్నో మార్లు,రోడ్లమ్మట...బ్రైయిన్స్‌లో..... "కళ్ళులేని కబోదిని బాబూ!" అంటూ అడుక్కోవటానికి వచ్చే బిచ్చగాళ్ళ నెందరినో చూశాడు ... "దొంగవెధ వలు...దొంగవేషాలు ..." అంటూ విసుక్కున్నాడు. మరీ మొండికి పడిన వాళ్ళను..."నీకళ్లు కనిపించకపోతే మాకా శిక్ష?" అంటూ మండిపడ్డాడు... కానీ...కానీ...ఈనాడర్థమౌతోంది.... చూపు పోవటమన్నది ఎంతటి యాతన! ఆ మటుకూ తనకుడబ్బుంది ....బలగం వుంది.. నౌకర్లున్నారు...అయినా జీవి తం దుర్భరమనిపిస్తోంది...ఇదే ఏ పేద వాడికో...మధ్య తరగతి కుటుంబీకుడికో అయితే...అవును ..ఎవరో మధ్య తరగతి కుటుంబీకుడు...ఎవరో ఏమిటి, రాఘవరావు...శంకరయ్యలో ఏదో ఆవే దన అగ్నిలా బుస్సున పైకి లేచింది... "అబ్బా! ఒద్దు...ఒద్దు...నాకీ నరకం వద్దు...నన్ను త్వరగా చంపెయ్ దేవుడా!" ఎలుగెత్తి అరిచాడు వున్న ట్లుండి. నౌకరు మల్లన్న పరుగెత్తుకు వచ్చాడు "ఏటి బాబూ! ఏం కావాల?" అన్నాడు. "ఏమీ వద్దు..." అ సహ నంగా అరిచాడు...

తనిక ఏ సుందరదృశ్యాన్నీ చూడ లేడు. తన భార్యాబిడ్డల మొహాలూ, వాటిలో మెరిసే భావాలూ...ఏమీ చూడ లేడు. ఆఖరుకు లావెట్రీలోకి కూడా ఎవరో ఒకరు నడిపించుకు వెళ్లవలసిన దుస్థితి..."ఎందుకలా బాధ పడతారు, మీకు చూపు రాకపోతేమాత్రం,మేమంతా లేమూ?" అంది భార్య జానకి తనను. తను అధైర్యపడుతుంటే....వుంది. ..

కానీ రాఘవరావులా...ఊహలూ ఏనాటికీ అలా వుండలేదు...

అబ్బబ్బ! నీ కళ్ళు పోయినా పోయాయిగానీ, నాన్నా!మా ప్రాణాలూ, డాక్టర్ల ప్రాణాలూ, కొరుక్కు తినేస్తున్నావ్!" అన్నాడు కొడుకు మారుతి కోపంగా...అప్పుడే అందరికీ విసుగు ప్రారంభమైంది...కాని రాఘవరావు ఎన్నేళ్ళు...ఎంత సహనంతో...

రాఘవరావుబస్సు కండక్టరు...అతగాడి భార్యలక్ష్మి...రాఘవరావు అభ్యర్థన...ఆనాటి తన తెలివితేటలు...లోలోపల నవ్వుకోవటం...

శంకరయ్య లోపల చీకటినుంచి, వికృతమైన నవ్వేదో ప్రతిధ్వనించింది! ఆ నవ్వు తరంగాలు...స్మృతి పేటికలను బద్దలు కొడుతున్నాయి. చీకటిగావున్న మనసూ, కళ్ళూ.... నల్లనితెరలమీద, తెల్లని బొమ్మల్ని చూపిస్తున్నాయి. చాలా సంవత్సరాలక్రితం జరిగిపోయిన సంఘటనేదో సినిమాలాకనిపిస్తోందా తెరమీద.

* * *

శంకరయ్య పెద్ద కంట్రాక్టరుగా స్థిరపడిపోయాడు. ఆ జిల్లాలో, జిల్లాలో ఏమిటి...ఆ రాష్ట్రంలోనే, ఏ రోడ్డు రిపేరు వచ్చినా, ఏ చెరువు త్రవ్వకం ప్రారంభింపబడినా, ఏ బ్రిడ్జి, పనిమొదలెట్టినా...ఏ హాస్టల్ బిల్డింగ్సుకు పునాది వేయాలన్నా, మొదటి టెండరు శంకరయ్యదే. కాంట్రాక్టూ శంకరయ్యదే, సిమెంటు కలిపే మేస్త్రీ మొదలు, ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ల వరకూ, శంకరయ్యను తెలియనివాళ్ళుగానీ, శంకరయ్యకు "సాయం" చేయనివాళ్లు గానీ లేరు! కాబట్టి, పదిహేనేళ్లలో శంకరయ్య పదిలక్షలు వెనకేశాడు! మరో పది లక్షలు రకరకాల వ్యాపారాలలో "రోల్" అవుతున్నాయని జనం గొప్పగా చెప్పుకుంటున్నారు. పట్టింది బంగారం, పలికేది వేదంగా వుందాయన పని.

ఆ రోజు...కారులో కూర్చుని కొత్తగా కాంట్రాక్టు తీసుకున్న ఓ బ్రిడ్జి వర్కు చూడటానికి బయల్దేరాడు. అనుకోకుండా కారు ట్రబుల్ ఇచ్చింది త్రోవలో.తిక్కకోపంతో డ్రైవర్నితిట్టి, నౌకర్ని తిట్టి, తనను తను తిట్టుకుని, కారు దిగి, రోడ్డువారగా బస్సుకోసం నిల్చున్నాడు. చీకటి పడుతోంది.తిన్నగా బస్సు వచ్చింది. డ్రైవర్ని, నౌకర్ని, కారు రిపేరు చేసుకురమ్మని, అక్కడే వదిలి బస్సులో కూర్చున్నాడు శంకరయ్య. అదేంఖర్మో. ఆ బస్సూ పది మైళ్ళు దూరంవెళ్ళి చెడిపోయింది! రోడ్డంతా గతుకులు. ఆ రూట్లో మరో బస్సు లేదిక! ప్రయాణీకులంతా ఈదురోమంటూ సామాన్లు మోసుక, దగ్గరగా వున్న గ్రామం కేసి వెళ్తున్నారు! శంకరయ్యకు దిక్కు తోచలేదు. భోజన

హోటల్ వున్న గ్రామంకూడా కాదుట అది।

బస్సు డ్రైవరూ, కండక్టరూ, క్లీనరూ, శంకరయ్య మాత్రం మిగిలి పోయారు. "మీరు శంకరయ్యగారు కదండీ।" అన్నాడు కండక్టరు సవినయంగా.

"హూం।" అన్నాడు విసుగ్గా। 'అయితే ఏం?' అన్న ధోరణిలో.

"నా పేరు రాఘవరావు లెండి, మీకీ రాత్రికి భోజనానికి ఇబ్బంది అవుతుందేమో... మీ కారుగానీ, మా బస్సుగానీ కండిషన్‌లోకి వచ్చేసరికి, కనీసం నాలుగ్గంటలేనా పడుతుంది. మా ఫామిలీ... అదీ ఆ వూళ్ళోనే వుంది. కాస్త దూరం నాతోబాటు నడిచారంటే...మా ఇంట్లో రాత్రికి బసచేసి,తెల్లారి వెడుదురుగానీ." అన్నాడు రాఘవరావు.

శంకరయ్యకు చిరాకుగా వుంది... ఆకలిగా వుంది. డబ్బున్న వాడని తెలిసి, ఇలా అతిమర్యాద చూపుతున్నాడేమో నన్న అనుమానమూ వుంది.చప్పున ఒప్పుకుంటే బావుండదేమోనన్న బెట్టూవుంది. కానీ, ఆ దుమ్ము కొట్టుకునివున్న రోడ్డూ, కడుపులో ఆకలీ, చుట్టూ రా ఆవరించిన చీకటీ, నీరసమూ, మరోగత్యంతరం లేని పరిస్థితీ ఆయనను ఒప్పించాయి.

షుమారు అరమైలు దూరం రోడ్డు దిగి కాలి బాటెంట మరో అరమైలు నడిచాక, గ్రామం కనిపించింది. అలవాటు లేని నడకతో ఆయాసం వచ్చేసిందాయనకు. ఆయనకు మధ్యమధ్య చెయ్యిఆసరా చేస్తూ, అలసట తెలీకుండా వుండాలని, ఏవేవో కబుర్లు చెబుతున్నాడు రాఘవరావు త్రోవ పొడుగూతా.

రాఘవరావు ఇంటర్‌మీడియెట్ వరకూ చదివాడట. ఓ మోస్తరుగా జరుగుబాటున్న కుటుంబమేనట. కానీ హఠాత్తుగా అతగాడి తండ్రి గుండె పోటుతో మరణించటంతో, కుటుంబ బాధ్యతంతా ఇతగాడిమీదే పడిందట. తనకున్న చదువుకు, ఏ ఉద్యోగమూ రాదని తెలిసి, ఈ బస్సు ఓనరు దయ తలచి ఇచ్చిన ఈ కండక్టరు ఉద్యోగంలో స్థిర పడ్డాడట. తనూ, తన భార్యా, ఇష్టపడి పెళ్ళాడారట...అది తన తల్లికీ, అక్కకూ ఇష్టంలేక, వాళ్ళు తనింటికే రారట...ముగ్గురు బిడ్డలట.

"ఇంకా ఎంత దూరం?" అన్నాడు శంకరయ్య. రాఘవరావు ముచ్చట ఏ మాత్రం వినసొంపుగా లేదాయనకు.

"అదో ఆ కనిపించే ఇల్లే।"

చిన్న పెంకుటిల్లు. ముందు చిన్న మట్టి అరుగులు. సందెదీపం వెలుగుతోంది వసారాలో.

"లక్ష్మీ!" వసారా దాటి లోపల అడుగెడుతూనే పిలిచాడు రాఘవరావు. అక్కడే గోడకు ఆనుకుని, చాపమీద కూర్చునివున్న ఆమె....లక్ష్మి,...అతగాడి భార్య...ఒక్కఉదుటున లేచి. గబ

గబా అతగాడి ఎదురుగావచ్చి, అత గాణ్ణి కౌగలించుకుంది!

"వచ్చారా!" ఆ గొంతుకలో ఏదో తృప్తి, ఏదో హాయి...ఏదో ఆనందం కొన్ని యుగాల తర్వాత కలుసుకున్నట్లు పిచ్చిగా అతగాడితలా, మొహమూ, మెడా,వెన్నూ, చేతులతో నిమురుతూ, ఏదో పెన్నిధిదొరికినట్లు ఊగిపోతోంది! వాళ్ళ పిల్లలు కాబోలు, పదమూడేళ్ళ కుర్రాడొకడూ,పదేళ్ళ కుర్రాడొకడూ, ఏడేళ్ళ పాపఒకర్తె ... లోపల్నుంచి వచ్చేశారు.

వసారాలో నిల్చునివున్న శంకరయ్య నిర్ఘాంతపోయాడు. చెట్టంతమనిషి, అందునా తనవంటి పెద్ద మనిషి... ఎదురుగా నిల్చునివుంటే...అవతల పిల్లలు నిల్చునివుంటే...ఏ భార్యావచ్చి.. ఇలా భర్తను...పెనవేసుకోవటం... ఇంత "ఇది" గా ప్రవర్తించటం... ఎక్కడా ఇలలో జరగనిపని...సినిమాలలో తప్ప! "ఛీ...ఛీ..." అనుకొంటూ ఇబ్బందిగా నిల్చుండిపోయాడు. రాఘవరావుకూడా తన ఉనికినే మర్చిపోయినట్లు, "వచ్చేశాగా!" అంటూ ఆమె తలా, వీపూ ఆప్యాయంగా నిమిరాడు...అంతలోనే "ఓ పెద్ద మనిషి మనింటికి వచ్చారు!" అన్నాడు మెల్లిగా.


ఆమె చప్పున అతగాడినుంచి దూరంగా జరిగింది "మరి చెప్పారు కారేం?" అంది నొచ్చుకుంటూ, సిగ్గుపడుతూ.

"ఆహా! కావిలించుకున్నప్పుడు లేని సిగ్గు . .ఇప్పుడు ముంచుకొచ్చింది కాబోలు!" అనుకున్నాడు శంకరయ్య.

"నువ్వుచెప్పనిస్తేనా!" రాఘవరావు నవ్వుతూ అన్నాడు. "కాస్త వేడినీళ్ళు కాచి, అన్నం వండేస్తాను వేడిగా. పాపం! ఆయనగారెప్పుడూ ఇలాటి ఇళ్ళలో అన్నంతినలేదు. ఒరేయ్ గోపీ! ఆ ఆచారిగారింటికెళ్ళి కాస్త మంచి పెరుగు పట్టుకురా." అన్నాడు. పెద్ద పిల్లాడు గిన్నెతీసుక పరిగెత్తాడు. లక్ష్మి నీరసంగా ఏదో గొణుక్కుంటూ చాప మీద కూర్చుండిపోయింది.

"అరె మీరింకా నిల్చునే వున్నారు కదూ! ఇలా ఈ మంచంమీద కూర్చోండి...మా ఆవిడ లక్ష్మి...కళ్ళు కనిపించవు!" అన్నాడు రాఘవరావు సంజాయిషీ చెబుతున్నట్లు.

అందాకా, చికాకుపడుతున్న శంకరయ్య, ఒక్కసారిగా చలించిపోయాడు, ఇందాకటి దృశ్యానికి అర్థం తెలిసిపోయింది. ఆయనలో జాలి ఉప్పెనలా పెల్లుబికింది. "పాపం! ఎంత దురదృష్టం? పుట్టుకతోనే చూపులేదా?" లాంతరు వెలుతురులో...చక్కగా తీర్చి దిద్దినట్లున్న ఆమెకళ్ళకేసి జాలిగాచూస్తూ



అడిగాడు. ఆసరికి రాఘవరావు కాకీ డ్రెస్సువిప్పి, అడ్డపంచె కట్టుకున్కొని బనీయను తొడుక్కున్నాడు.

"ఊహూఁ! ఈమధ్యే ... సుమారు ఐదునెలలు కావొస్తోంది! హఠాత్తుగా ఓరోజు నిద్రలేచి... కళ్ళు కనిపించడం లేదంది! అందాకా మాలక్ష్మి కంటివెలుగుతో, హాయిగా సాగుపోతున్న మా ఇల్లు...ఒక్కసారిగా చీకటైపోయింది!" రాఘవరావు గొంతుకలో దుఃఖం ఆపుకుంటున్న ప్రయత్నం...

"మరి కంటిడాక్టర్లకు చూపించలేదూ?" ఆదుర్దాగా అడిగాడుశంకరయ్య.

"చాలామందికి చూపించాను..."

లక్ష్మి వెక్కిళ్ళు పెడుతోంది... "ఈ కబోదిబ్రతుకు ఎంత నరకం బాబుగారూ! నేను చచ్చిపోయినా...ఆయన, పిల్లలూ సుఖపడేవారేమో...!"

"లక్ష్మీ!" సహించలేనట్లు అరుస్తూ, ఆమె దగ్గరిగావెళ్ళి, ఆమెను పొదివి పట్టుకున్నాడు రాఘవరావు... "ఏమిటా మాటలు? ఒకవేళ నాకే నీలాకళ్ళుపోయి

వుంటే...అలాగే అనుకునేదానివా! ఛీ...ఛీ... ఏడవకు ... నా బంగారు కదూ! నా కళ్ళులేవూ నీకు? నేనెక్కడున్నా, నాలోని ప్రతి అణువూ వేయి కళ్ళుగా ... నీ చుట్టూరానే వుంటోంది లక్ష్మీ!"

లక్ష్మి మెల్లిగా తనను తాను కంట్రోల్ చేసుకుంది.

ఆ దంపతుల అనురాగం, దుర దృష్టం.. శంకరయ్యను చలింపజేసింది.

రాఘవరావు వేణ్ణీళ్ళ సిద్ధంచేశాడు అన్నం వండేడు. ఆ పనులుచేస్తూనే కబుర్లు చెబుతున్నాడు.


"లక్ష్మికి కళ్లుపోయాయని తెలిసి... మాఅక్క... విధవావిడను ...పిల్లలకు సాయంగా పిల్చుకొచ్చుకోమని చాలా మంది సలహా ఇచ్చారు. లక్ష్మికూడా చెప్పింది. నాకే ఇష్టంలేదు...లక్ష్మిఅంటే ఆమె కిష్టంలేదు... ఆ కోపంతో ... అవకాశం చిక్కిందికదాని ... చూపులేని లక్ష్మిని ఏమంటుందో... ఏం చేస్తుందో నని నా భయం...పైగా...నన్ను మరో పెళ్ళి చేసుకోమని సలహా ఇచ్చిదావిడా, మాఅమ్మ! ఛీ...ఛీ...ఎంత సంకుచిత మనస్కులో చూడండి ... నా లక్ష్మికి చూపుపోయిందేగానీ...మనసూ,మమతా పోయిందా? నాలోనూ మానవత్వం పోవాలా?"

శంకరయ్య మంత్రముగ్ధుడిలా వింటూండిపోయాడు. "డ్యూటీలోకి వెళ్ళే లోగా, ఉదయాన్నే అన్నం, సాదకాలు చేసిపెట్టేస్తాను. రాత్రికి నేనొచ్చేసరికి ఆలస్యమైతే, పిల్లలే అన్నంవండుతారు. పిల్లలకుపెట్టి...నేనూలక్ష్మీతింటాం..."

ఆ రాత్రంతా రాఘవరావు ఇంట్లో వున్న శంకరయ్యకు, ఎంతో ఆనందంతోబాటు, ఎనలేని ఆవేదనా కలిగింది. తెల్లారేసరికి కారువచ్చింది. శంకరయ్య, రాఘవరావుకు పాతిక రూపాయలు ఇవ్వబోయాడు. రాఘవరావు అభిమానంగా తిరస్కరించాడు. "నా అతిధ్యానికి మీరు మూల్యం చెల్లించవద్దు. ఓ చిన్నసాయం కోరుతాను...చేయగలిగితే చెయ్యండి!" అన్నాడు, ఏదో గుర్తుకొచ్చినవాడిలా.

క్షణకాలం శంకరయ్య లోలోపల గతుక్కుమన్నాడు. ఉదయకిరణాలతో బాటు...ఆయనగారిలో మామూలు మన స్థితి వచ్చేస్తోంది "ఎక్కువ చందా అడగడుకదా?" అనిపించిందాయనకు.

"మరేమీలేదు. ఈమధ్య హైద్రాబాదులో విదేశాలనుంచి ఓ ఐ స్పెషలిస్టు వచ్చి వున్నాడట. ఆయన మరో నెలరోజులు మాత్రమే హైద్రాబాదులో వుంటాడట. ఐదారువందలు ఖర్చుపెట్టుకుంటే... మా లక్ష్మిలాటి కేసులకు...ఏదో ఆపరేషన్ చేస్తాడట...తిరిగి చూపువచ్చే అవకాశం వుంటుందన్నారు చాలామంది. అయితే ఇలా కళ్లుపోయిన ఆరునెలలు నిండే లోగా ఆపరేషన్ జరగాలట ..." అన్నాడు రాఘవరావు.




'కొంపదీసి ఆ ఆపరేషన్‌కయ్యే ఖర్చు నన్ను భరించమంటాడా ఏమిటి? అనవసరంగా అతిదయ చూపించానేమో!' అన్నాడు శంకరయ్యలోని మరో మనిషి

"ఇలారండి!" పెరట్లో చిన్న రేకుల షెడ్డులోకి పిల్చుకెళ్లాడు రాఘవరావు. ఆ షెడ్డులో వరసగా ఓ ఏభై, అరవై సిమెంటు కట్టలు వరసగా అమర్చి వున్నాయి. "లక్ష్మికిలా జరక్కుండా వుండివుంటే, ఈ చిన్న ఇంటి గోడలూ, నేల అంతా సిమెంటు చేయిద్దామనీ, మరో చిన్నగది కట్టిద్దామనీ, మా ఓనరు గారినడిగి, అప్పుతీసుకుని ఈసిమెంటూ, మరికొంతకొయ్యసామానూకొన్నాను... ఈలోగా మా దురదృష్టం ఇలా తారుమారు చేసింది. లక్ష్మి కళ్ళకోసం డాక్టర్ల దగ్గరకు తిరగటానికి చాలా డబ్బు ఖర్చయింది. అప్పులయినాయి. ఇక ఇప్పట్లో ఇల్లుపూత ప్రసక్తే లేదు ... కొయ్య సామానూ ఎలాగోలా అమ్మేశాను. కానీ ఈ సిమెంటు అమ్ముడుపోలేదు. కారణం కొస్తంత గట్టిపడి గడ్డలుకట్టింది...ఎవరూ కొనటంలేదు ... మీరు కాంట్రాక్టరు కదాని ... ఎక్కువ చనువుతీసుకొంటున్నాననుకోకండి ... ఓ చిన్నసాయం కోరుతున్నాను... అదీ ఇందాక గుర్తొంచ్చింది..." రాఘవరావు ఆగాడు.

శంకరయ్య ఇబ్బందిగా ... అడగమన్నట్లు చూశాడు.

"మీరా బ్రిడ్జి కాంట్రాక్టుతీసుకున్నారు గదా! క్రింద దిమ్మెలు కట్టడానికి, కంక

రతో బాటు కలపటానికి "రఫ్" క్రింద ఈ సిమెంటు పనికివస్తుంది ... నేను కొన్న ఖరీదుకంటే ఓరూపాయి తక్కువగానే ఇస్తాను...మొత్తంగా మీరు తీసుకోండి. ఆ డబ్బుతో నేను లక్ష్మిని హైద్రాబాదు తీసుకెళతాను. నాకు సమయానికి డబ్బుపుట్టినట్లూ వుంటుంది. మీ చేతి చలువవల్ల... మాలక్ష్మికి కళ్లువస్తాయేమో...!" రాఘవరావు కంఠస్వరంలో ఆర్ద్రతా, ఆశానిండివున్నాయి.

"ఓహ్! అదెంతభాగ్యం...ఈబస్తాలన్నీ బ్రిడ్జిదగ్గరకు చేర్చేబాధ్యత నీదే!" అన్నాడు శంకరయ్య.

రాఘవరావు ఆనందంగా తలూపాడు. శంకరయ్య కారుకదలిపోయింది. వారంరోజులు తర్వాత, బాడుగబళ్లు మాట్లాడుకొని, సిమెంటు బస్తాలు బ్రిడ్జి దగ్గరకు చేరవేశాడు రాఘవరావు. శంకరయ్య చాలా బిజీగావున్నాడు కూలీలూ, మేస్త్రీల లెక్కలతో. డబ్బుకు మరోమారు రమ్మన్నాడు. రాఘవరావు ఇంట్లో బసచేసిన నాటిరాత్రి మనస్థితి ఈనాడు లేదాయనలో. ఆ రోజు ... ఆయనలో ఆవహించిన "మానవత్వం... కరుణ" తాత్కాలికమైనవి కేవలం "ఎమోషన్" అయివుండవచ్చు. ఈరోజు ఇక్కడున్న శంకరయ్యలో."కాంట్రాక్టరు"మాత్రమే జీవించి వున్నాడు. బిల్లులు పెద్ద మొత్తంలో శాంక్షన్ చేయించుకోవాలి... ఈ బ్రిడ్జిమీద కనీసం పాతికవేలైనా లాభంరావాలి...మరోరోడ్డుకాంట్రాక్టుకు టెండరు వేయాలి. ఇదే ఇప్పుడాయనలో వున్న ఆందోళనా, ఆలోచనా...


వారం తర్వాత మళ్లీ రాఘవరావు వచ్చాడు. బాడుగబళ్ళవాళ్లు, బాడుగకోసం వత్తిడిచేస్తున్నారు ... లక్ష్మిని హైదరాబాదు తీసికెళ్లాల్సిన గడువు కూడా దగ్గర కొస్తోంది...శంకరయ్యలో కొత్తభూతం ఆవహించింది.

ప్రపంచంలో ఎందరు కళ్ళులేని కబోదులు లేరు? కొందరు దొంగ ఎత్తులు వేస్తారు! కొందరు నిజంగానేవుండొచ్చు. ఆరాత్రి రాఘవరావు...తనలో బలహీనత రేకెత్తించే నాటకం ఆడలేదుకదా? తన దగ్గర డబ్బుగుంజాలని ... ఓకథ తయారు చేయలేదుకదా? ఏమో!

ప్రపంచంలో ఎందరో బాధితులూ, పీడితులూ వున్నారు. వాళ్ళందర్నీ తను ఉద్ధరించగలడా? అలా ఉద్ధరించటం ప్రారంభిస్తే, త్వరలోనే తనూ వాళ్లలో కలిసిపోతాడు...ఆ తర్వాత, తనభార్యా బిడ్డల గతేమిటి?

"ఎల్లుండి రావోయ్ రాఘవరావ్! మా మేస్త్రీ ఇంకా ఆ సిమెంటు పరీక్ష చేయలేదు..." అన్నాడు.

రాఘవరావు కాళ్లీడ్చుకుంటూ వెళ్లాడు. సిమెంటు, కంకరా వగైరా పాళ్లుకలిపే మేస్త్రీని పిలిచి, కాస్సేపు మంతనాలు చేశాడు శంకరయ్య. తర్వాత గుమాస్తా గుర్నాథాన్నిపిలిచి ఏదో మాట్లాడాడు...




లోలోపల ముసిముసిగా నవ్వుకుంటూ కారులో కూర్చున్నాడు.

ఎల్లుండి రానేవచ్చింది. రాఘవరావూ వచ్చాడు.

"ఏమిటోయ్ రాఘవరావ్ ! ఈ సిమెంటు అసలు పనికిరాదంటున్నాడు మా మేస్త్రీ. ఓ రూపాయి తక్కువని కాదు ... నీకేదో సాయంచేద్దామని చూస్తే... రేపొద్దున బ్రిడ్జికూలిందంటే "కట్టించిన కాంట్రాక్టరెవడు ?" అంటూ నా భరతం పడతారు జనం ! ఒక్కొ బస్తాకు సగంబస్తా కూడా తేలదట పని కొచ్చే సిమెంటు... వెనక్కి తీసుకెళ్ళు... మరెవరికేనా అమ్ముకో ! కావలిస్తే, నీ భార్య వైద్యంకోసం ఓ పాతికో పరకో సాయంచేస్తాను ... నలుగురిని అడిగా వంటే...డబ్బు జమపడకపోదు..." అంటూ కూలీల వర్క్ మీదికి దృష్టి మరలించాడు శంకరయ్య. రాఘవరావు మొహం ... క్షణకాలం ఎర్రగా ... అగ్నిలా ... మారిపోయింది ... ఏదో ఆవేశం ... మరేదో ఆవేదన బలవంతంగా అణుచుకుంటున్నట్లు పెదవులు కంపించిపోయాయి ... పిడికిళ్లు బిగుసుకున్నాయి ... క్షణకాలం తర్వాత ... అతనా స్థితినుంచి తేరుకున్నాడు.

"అలా దానం వద్దుసార్ ! పదిమంది దగ్గర అడుక్కువచ్చానని తెలిస్తే, లక్ష్మి ఆపరేషన్‌కు అసలు ఒప్పుకోదు. బాడుగ ఒళ్లకు ఈసరికే ముప్పై రూపాయలు అయింది. తిరిగి ఈ బస్తాలు మాఇంటికి తీసికెళ్లేకంటే, ఈ బ్రిడ్జిలో ఊరికే

ఛిమ్మరించటం మంచిది! సరే! మీకు తోచిన ఖరీదే ఇవ్వండి మీరెందుకు నష్టపడాలి?" అన్నాడు. అతగాడి కంఠస్వర కంపనలలో "మీగుట్టుకని పెట్టాను లెండి!" అన్న అసహ్యం ధ్వనించినట్లు తోచింది శంకరయ్యకు.

"గుర్నాధం! ఏదో ఓ ధర కట్టవోయ్!" అంటూ పక్కనున్న గుమాస్తా మీదికి నెట్టేశాడు బాధ్యత.

"బస్తా ఐదురూపాయలైనా నష్టమేనండి!" అన్నాడతగాడు. రాఘవరావు కళ్లు విస్ఫారితాలైనాయి ... "బస్తా పన్నెండు రూపాయలకు కొన్నవివి! కనీసం పదిరూపాయలలైనా గిడుతుందనుకున్నాను!" అస్పష్టంగా గొణుక్కున్నాడు.

"నీ యిష్టమైతేనే ఇవ్వు రాఘవరావ్! బలవంతం ఏమీలేదు!" అన్నాడు శంకరయ్య ఉదారంగాః వ్వుతూ. రాఘవరావు మాట్లాడలేదు. "ఊ! డబ్బు ఇచ్చెయ్ గుర్నాధం! ఓ రూపాయి, అటో ఇటో...అతగాడు డబ్బుకు ఇబ్బంది పడుతున్నాడు పాపం!" అని రెండు వందల యాభై రూపాయలు అతగాడి చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు శంకరయ్య.


ఆ తర్వాత, రాఘవరావును చాలా కాలంవరకూ చూడలేదు. కారణం తిరిగీ ఆ బస్సులో ఏ రోజూ ప్రయాణంచెయ్యలేదు...అసలు రాఘవరావును గురించి గుర్తుచేసుకోవలసిన అవసరం కూడా కలగలేదు...

సుమారు ఎనిమిదేళ్ళ తర్వాత... సుమారు మూడునెలల క్రితం ... ఓ రోజు ... కారుటైరు పంచరయి ... ఆ గ్రామానికి దగ్గరలో రోడ్డుమీద కారు ఆగినప్పుడు, అప్పుడే డ్యూటీకి వెడుతూ రోడ్డుదగ్గరకు వచ్చిన రాఘవరావు కనిపించాడు కళ్ళజోడుపెట్టుకుని వున్నందువల్ల ...అసలు గుర్తించలేకపోయాడతగాణ్ని శంకరయ్య.

"బాగున్నారా బాబుగారూ!" అంటూ రాఘవరావే హెచ్చరించాడు...అప్పుడు గుర్తొచ్చిందా, రాత్రి... లక్ష్మి కళ్ళు... "నీ భార్యకు ఆపరేషన్ చేయించావా? చూపువచ్చిందా!" అని అడగాలనిపించిందేగానీ, ఎంచేతో అడగలేకపోయాడు. ముభావంగా "ఊ!" అనేశాడు. అతగాడి బస్సువచ్చింది. ఎక్కివెళ్ళిపోయాడు. అతగాడు వెళ్ళాక. డ్రైవర్ని అడిగాడు శంకరయ్య "అతగాడి భార్యకుచూపువచ్చిందా?" అంటూ. డ్రైవరు ఆ చుట్టుప్రక్కల గ్రామప్రాంతాలవాడే.

"ఊహూ(. డబ్బు అందలేదట సమయానికి ... అయితేనేం బాబుగారూ! అంతటి అన్యోన్యంగావుండే దంపతుల్ని అరుదుగా చూస్తాం. పిల్లలు కాస్తచేతికందివచ్చారు..."

ఇకా వివరాలలో ఆసక్తిలేనట్లు... తలతిప్పేసుకున్నాడు శంకరయ్య. నెల గిర్రున తిరిగింది ... ఓ సాయంత్రం డబ్బులెక్కలు చూచుకుంటున్న శంకరయ్య కళ్ళముందు హఠాత్తుగా చీకటి వలయాలు తిరగటం ప్రారంభించింది. కళ్ళుబైర్లుకమ్ముతున్నాయనుకున్నాడు...



కానీ ... మరు నిముషంలో చూపే పోయింది।

కలవరపడిపోయాడు. పిచ్చికేకలు వేసాడు. ఇంటిల్లిపాదీ బాధపడ్డారు. డాక్టరు ... మందులు ... ఇంజక్షన్లు, హడావిడి, వందలు, వేలూ ... మంచి నీళ్ళప్రాయంలా సాగిపోతోంది... కానీ చీకటి విడిపోలేదు ... ఇక్కడ ఈ ఐ స్పెషలిస్ట్ చూపుతెప్పిస్తాడని ఆశతో వచ్చాడు...రేపు ఆపరేషన్...

* * *

దగ్గరలో అడుగుల చప్పుడు . .

"ఏమండీ నిద్రపోతున్నారా।" కొడుకూ, భార్యా వచ్చారల్లేవుంది ... జానకి గట్టిగా అడుగుతోంది. గతం చెదిరింది. వర్తమానం బెదిరిస్తూ నిల్చుంది ఎదురుగా. శంకరయ్య మనే స్సులో ... ఇంకా రాఘవరావు రూపం చెదిరిపోలేదు ... లక్ష్మి కళ్ళుమాయం కాలేదు ...

"నేనూ పడుకుంటాను ... మళ్లీ లేస్తే కేకలువేస్తుంటారు।" తను నిద్ర పోతున్నాడనుకొని భార్య, కొడుకుతో

అంటోంది. అందరికీ విసుగ్గా వుంది. మొదట్లో కొన్ని రోజులు జాలితో సేవ చేశారు ... తర్వాత విధిలేక చేశారు ... ఇప్పుడు విసుగుతో చేస్తున్నారు ... రేపు ఆపరేషన్ అయ్యాక చూపురాకపోతే...? లక్ష్మిలా... ఆ ఊహతో శంకరయ్య శరీరం జలదరించింది ... "అబ్బా! ఎలా బ్రతకటం?" అన్నాడు అనుకోకుండా పైకి ... జానకి దగ్గరగా వచ్చింది ...

"ఏమిటి? కలవరిస్తున్నారా? కృష్ణా, రామా, అనుకోండి ... మీకు చూపురాకపోతే ... మేమంతా లేమూ?" అంది నిద్రమత్తు ... ఆవలింతలూ కలిసి విసుగ్గా ...

'వున్నారు ... కానీ రాఘవరావు లాటి విశాల హృదయం మీలో ఎవరికుంది? ఏమో! పాపం! ఆ లక్ష్మి ఎంత ఆవేదనపడుతోందో ఇన్నేళ్లగా... అతగాడు, పిల్లలతో, చాకిరీతో ... ఆమెను ప్రాణాధికంగా చూచుకుంటూ... ఎంత అవస్థలు పడుతున్నాడో ... కానీ నాకంటే ... మీకంటే ... చాలా ఉన్నతుడు రాఘవరావు ... అతగాడికి డబ్బే లేదు. కానీ మమతవుంది. మానవత్వముంది ... నాకు డబ్బుంది ... ఏమీలేనివాణ్ణి నేను ...!'

జానకి గాభరాగా భర్త దగ్గరకు వచ్చింది. "కళ్ళతోబాటు మతికూడా పోయిందా ఏమిటి మీకు? ఆ రాఘవరావెవడు? లక్ష్మి ఎవరు?... ఖర్మ! రేపొద్దున ఆపరేషన్. కళ్లుపోయి మూణ్ణెల్లేనా కాలేదు. మతి పోగొట్టుకొనేలా వున్నారు ... కబోది బిచ్చగాళ్ళలా ... పిచ్చవాగుడూ ... మీరూను ..."

శంకరయ్యకు నవ్వొచ్చింది... "నీకు తెలియదు జానకీ! నేను మూడు నెలల క్రితంగాదు గుడ్డివాణ్ణయ్యింది ... చాలా సంవత్సరాలక్రితమే కబోదినయ్యాను..."

ఆమె అర్థంగానట్లుచూచి...భర్తకు పైత్యంగావుందని డాక్టరుకు కబురుచేయటానికి, నౌకర్ని లేపటానికి వెళ్ళింది...

శంకరయ్య మనసు, రాఘవరావుతో అంటోంది "రాఘవరావ్! ఆ రోజు మేస్త్రీచేతా, గుమాస్తాచేత అలా పలికించింది నేనే! ఆ గుట్టు నువ్వూ కనిపెట్టావు ..."

ఆ రోజే నేను కళ్ళున్న కబోదినయ్యాను. ఎదుటి మనిషి బాధచూస్తూ కూడా తెలుసుకోలేని చిమ్మచీకటి నా మనో నేత్రాలను ఆవరించి, వాటిలో చూపు ఆనాడే పోయింది.

శంకరయ్య బాధాతప్త హృదయంలో చీకటి ఆవరించి వుంది. బయటకూడా చీకటితప్ప మరేమీ కనిపించటంలేదు. చూపుపోయిన కళ్ళలోనుంచి, కన్నీరు ప్రవహిస్తోంది ఆగకుండా.